క్లుప్తంగా

విఘ్నేశ్వరస్వామి హుండీల లెక్కింపు



హుండీలు లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని విఘ్నేశ్వర స్వామి హుండీలను గురువారం లెక్కించారు. మూడు నెలల 20 రోజులకు రూ.2.10 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ శివబాబు తెలిపారు. ఈ హుండీలు లెక్కింపు దేవదాయశాఖ కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

పేదలకు వస్త్రాలు, కళ్లజోళ్ల పంపిణీ



కళ్లజోళ్లు, వస్త్రాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

బాలాజీచెరువు: రెడ్ కాన్వెంట్ చారిట్రబుల్ ట్రస్ట్ పూర్వ విద్యార్థుల సంఘ ఆధ్వర్యంలో లయన్స్ హాల్లో గురువారం వృద్ధులకు కళ్లజోళ్లు, వస్త్రాలు పంపిణీ చేశారు. డాక్టర్ బాదం బాలకృష్ణ చేతుల మీదుగా 85 మందికి వాటిని అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు పాపారావు, రెడ్నం రమణామూర్తి, వీవీ రామ చరణ్ పాల్గొన్నారు.

వైభవంగా సీతారామ కల్యాణం



సీతారామస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని టౌన్‌హాల్ ఎదురుగా ఉన్న సీతారామస్వామి ఆలయంలో గురువారం స్వామి జన్మనక్షత్రమైన పునర్వసు సందర్భంగా స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు భావవరపు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తకంగా కల్యాణం నిర్వహించారు. అమ్మవారికి గౌరీపూజతో మొదలెట్టి, కల్యాణ తలంబ్రాల వరకూ అన్ని ఘట్టాలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.




ఆర్టీసీలో ఇక నగదు రహితం



నగదు రహిత లావాదేవీలను ప్రారంభిస్తున్న జిల్లా ప్రజా రవాణాధికారి శ్రీనివాసరావు

కాకినాడ: ఆర్టీసీలో కూడా నగదు రహిత లావాదేవీలకు శ్రీకారం చుట్టారు. ఆర్టీసీ యాజమాన్యం ఆదేశాల మేరకు అన్ని బస్‌స్టేషన్లలో అడ్వాన్స్ రిజర్వేషన్ కౌంటర్లలో గురువారం నుంచి ఆన్‌లైన్ పేమెంట్ సదుపాయం అమలులోకి వచ్చింది. ఫోన్ పే, గూగుల్‌పే, పేటీఎం ద్వారా ప్రయాణికులు నగదు రహితంగా టిక్కెట్లు తీసుకునే అవకాశాన్ని కల్పించారు. జిల్లా ప్రజారవాణాధికారి ఎం.శ్రీనివాసరావు గురువారం ఆర్టీసీ బస్టాండ్‌లో నగదు రహిత తొలి ఆన్‌లైన్ టిక్కెట్‌ను ప్రయాణికులకు అందజేశారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కాకినాడ డిపో మేనేజర్ ఎంయూపీ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, స్టేషన్ మేనేజర్ జి.శ్రీనివాస్, రిజర్వేషన్ కౌంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురికి ఉత్తమ సేవా పురస్కారాలు

బుల్లికృష్ణవేణి | శ్రీనివాసరావు | స్వాతి అహల్య

కరప: మండల పరిధిలో ముగ్గురు అధికారులకు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ సేవాపురస్కారాలు లభించాయి. ఎంఈఓ–1 కె.బుల్లికృష్ణవేణి, ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు, నడకుదురు వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్ ఎంఎల్‌హెచ్‌పీ కె.స్వాతి అహల్య ఉత్తమసేవా పురస్కారాలకు ఎంపికయ్యారు. శుక్రవారం కాకినాడ పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ కృతికాశుక్లా, జిల్లా మంత్రి దాడిశెట్టి రాజా తదితరుల నుంచి ఉత్తమ సేవా పురస్కారాలు తీసుకోనున్నట్టు వారు తెలిపారు.

ఆడుదాం.. అజేయంగా నిలుద్దాం..

- వెల్లివిరిసిన క్రీడా స్ఫూర్తి
- గ్రామాలలో సందడి చేసిన యువత
- ముగిసిన నియోజకవర్గ స్థాయి క్రీడలు
- జిల్లా స్థాయి పోటీలకు సమాయత్తం



వాకలపూడి హైస్కూల్‌లో గత నెల 26న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, జేసీ ఇలక్కియ (ఫైల్)

కాకినాడ రూరల్: ఆహ్లాదకరమైన వాతావరణంలో క్రీడా చైతన్యంతో ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాలు నియోజకవర్గ యువతీ, యువకుల్లో సందడి తీసుకువచ్చాయి. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ఆణిముత్యాలను వెలికి తీసేలా సంక్రాంతికి ముందే ఆడుదాం ఆంధ్రా సంబరాలకు సీఎం జగన్ శ్రీకారం చుట్టారు. క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు రికార్డు స్థాయిలో రాష్ట్రంలో సుమారు 62 లక్షల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. జిల్లాలో సుమారు లక్ష మంది తమ పేర్లను నమోదు చేసుకోగా నియోజకవర్గం నుంచి ఎక్కువ మంది యువతీ యువకులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఫిబ్రవరి పదో తేదీ వరకు సుమారు 47 రోజుల పాటు జరగనున్న ఈ పోటీలు నియోజవర్గ స్థాయిలో విజయవంతంగా ముగిశాయి. డిసెంబరు 26న మండలం వాకలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, జేసీ ఇలక్కియ పోటీలను ప్రారంభించారు. క్రికెట్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి



కాకినాడ రూరల్ నియోజకవర్గ స్థాయి పోటీలలో బాడ్మింటన్ విభాగంలో విజేత జట్టు

పోటీలు జరిగిన తీరు ఇలా..

తొలుత సచివాలయ స్థాయిలో కాకినాడ రూరల్‌లో 41, కరప మండలంలో 21 సచివాలయాల పాటు అర్బన్‌లోని రూరల్ నియోజకవర్గ 17 సచివాయాలలో ఈ పోటీలు జరిగాయి. రెండు మండలాలు, అర్బన్‌లోని రూరల్ నియోజకవర్గ డివిజన్ల నుంచి నియోజకవర్గ స్థాయికి ఎంపికైన క్రీడా జట్లకు నిర్వహించిన పోటీలు గురువారం ముగిశాయి. నియోజకవర్గ స్థాయిలో విజేతలు జిల్లా స్థాయిలో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు.

నియోజకవర్గ స్థాయి పోటీల్లో విజేతలు వీరే

నియోజకవర్గ స్థాయిలో క్రికెట్, వాలీబాల్, బాడ్మింటన్, కబడ్డీ, ఖో ఖో పోటీలను ఒక్కో విభాగం నుంచి నాలుగు గేమ్‌ల చొప్పున మొత్తం 20 నిర్వహించారు. విజేతలుగా పురుషులు విభాగంలో క్రికెట్‌లో తూరంగి–4, కబడ్డీలో సూర్యారావుపేట–1, బాడ్మింటన్‌లో కాకినాడ అర్బన్ వైద్యనగర్–2, ఖోఖోలో కొవ్వాడ, వాలీబాల్‌లో కరప మండలం నడకుదురు జట్లు విజయం సాధించాయి. మహిళల విభాగంలో కబడ్డీలో సర్పవరం–3, ఖోఖోలో కాకినాడ అర్బన్ బీసీ కాలనీ, బాడ్మింటన్‌లో రమణయ్యపేట–2 జట్లు క్రీడాకారులు విజేతలుగా నిలిచారు.

క్రీడలతో చైతన్యం



రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీల ద్వారా క్రీడాకారుల్లో చైతన్యం తీసుకువచ్చింది. నెల రోజుల పాటు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నాం. నియోజవర్గం నుంచి జిల్లా స్థాయిలో సత్తా చాటుతాం.

– వేణుగోపాల్, బాడ్మింటన్ క్రీడాకారుడు, రమణయ్యపేట వైద్యనగర్, రూరల్ నియోజకవర్గం

విజయవంతంగా క్రీడా పోటీలు



ఆడుదాం ఆంధ్రా పోటీలను విజయవంతంగా నిర్వహించాం. యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సచివాలయ, మండల, నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహించాం. జిల్లా స్థాయి పోటీలకు జట్లను ఎంపిక చేశాం.

– కర్రే స్వప్న, ఎంపీడీఓ, కాకినాడ రూరల్ మండలం

వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దనే ఓటు



ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు

కాకినాడ సిటీ: 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, వికలాంగులు ఇంటి వద్దనే ఈవీఎం ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఎపిక్ కార్డుల జారీ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించే నిమిత్తం ఆర్డీవో ఇట్ల కిశోర్ ఆధ్వర్యంలో ప్రచార శకటాన్ని కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ సతీష్‌కుమార్, ప్రజా ప్రతినిధులు రిబ్బన్ కట్ చేసి, జెండా ఊపి ప్రారంభించారు.

ఓఎన్‌జీసీ డీజీని కలసిన కలెక్టర్



డాక్టర్ పల్లవి జైన్ గోవిల్‌ను మర్యాద పూర్వకంగా కలసిన కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: కాకినాడకు వచ్చిన ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ డైరెక్టర్ జనరల్ హైడ్రో కార్బన్స్ డాక్టర్ పల్లవి జైన్ గోవిల్‌ను కలెక్టర్ కృతికా శుక్లా మర్యాద పూర్వకంగా కలిసారు. కాకినాడ జీఆర్‌టీ గ్రాండ్ హోటల్ వద్ద ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జిల్లా అభివృద్ధికి సంబంధించిన పలు విషయాలపై కలెక్టర్ కృతికా శుక్లా, పల్లవి జైన్ గోవిల్ చర్చించారు.

అభివృద్ధితో మారుతున్న గ్రామ స్వరూపాలు

- రూ.5.5 కోట్ల పనులకు ప్రారంభోత్సవాలు
- ఎమ్మెల్యే కన్నబాబు విస్తృత పర్యటన



ఉప్పలంకలో స్థానిక నాయకులతో కలసి గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలతో గ్రామాల స్వరూపమే మారిపోయిందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. స్థానిక నాయకులు, అధికారులతో కలసి ఆయన మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన, ఇవ్వని హామీలన్నింటినీ నెరవేర్చి, ప్రజల్లోకి వెళ్లగలుగుతున్నామంటే సీఎం జగన్ ఇచ్చిన ఆశీస్సులు, ప్రోత్సాహమే కారణమన్నారు. గ్రామాల్లోని ప్రజలు ఎక్కడకు వెళ్లక్కరలేకుండా ప్రభుత్వసేవలు అందిస్తున్నామన్నారు. ముందుగా ఉప్పలంకలో రూ.2 కోట్లతో నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్‌సెంటర్ భవనాలకు, ఇంటింటికీ కుళాయి కనెక్షన్, సీసీ రోడ్లు, డ్రెయిన్లకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవాలు చేశారు. తర్వాత నడకుదురులో పర్యటించి రూ.2.5 కోట్లతో నిర్మించిన రెండు గ్రామ సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్, ఆర్‌బీకే భవనాలకు, సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. తర్వాత పెనుగుదురులో పర్యటించి రూ.కోటితో నిర్మించిన ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌ను ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి, సర్పంచ్‌లు బొమ్మిడి నయోమి, డేగల లలితకుమారి, రెడ్డిపల్లి వెంకటమాధవి, సాదే ఆశాజ్యోతి, ఎంపీటీసీలు కాలాడి కామేశ్వరరావు, ముమ్మిడి బుచ్చిబాబు, పైలా తులసి, బండారు సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, బొమ్మిడి శ్రీను, పైలా గోవిందు, వెలమల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు గుల్లిపల్లి మాధవస్వామి, ఎంపీడీఓ కె.అప్పారావు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమం

కరప: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి మేలు చేకూరుతోందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా గురువారం విజయరాయుడుపాలెంలో ఆయన సర్పంచ్ వెలుగుబంట్ల సీతారామ రాఘవ, మండల కన్వీనర్ కాదా వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు బొండా చంటిబాబు, ఏఎంసీ డైరెక్టర్ నున్న వెంకటేశ్వరరావు తదితర పార్టీ నాయకులు, స్థానిక నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ కార్యకర్తలతో కలసి ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ఎవరికి ఏయే పథకాల ద్వారా ఎంతమేర లబ్ధి చేకూరిందో వివరించారు. అర్హత ఉండి, ఎవరికైనా ఏ పథకమూ మంజూరు కాకపోయినా తిరిగి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో గెలిపించి, తిరిగి ముఖ్యమంత్రి చేయాలని ఎమ్మెల్యే కన్నబాబు కోరారు.

పండూరు రైతులకు పరిహారం

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- 'అందరికీ ఇళ్లు' పథకానికి స్థలం ఇచ్చిన యజమానులకు రూ.4 కోట్ల పంపిణీ



ఆర్డీఓ కిశోర్‌తో కలసి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: పేదలందరికీ ఇళ్ల పథకం కింద జగనన్న కాలనీల ఏర్పాటుకు పండూరు గ్రామంలో సేకరించిన భూమికి ఆయా రైతులకు ప్రభుత్వం అందజేసిన పరిహారం రూ.4 కోట్లను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పంపిణీ చేశారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మొత్తం 18 మంది రైతులకు పరిహారం చెక్కు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ నవరత్న సంక్షేమ పథకాలలో భాగంగా పేదలందరికీ ఇళ్ల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడంతో పేదలకు నేడు విలువైన ఇంటి స్థలం, ఇళ్లు మంజూరవ్వడంతో చాలా మంది సొంతింటి కల సాకారమైందన్నారు. పండూరుతో పాటు పలు గ్రామాల్లో భూమిని అందించిన రైతులకు పరిహారం మంజూరైందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీఓ ఇట్ల కిశోర్ మాట్లాడుతూ పండూరు రైతుల పరిహారం కోసం తమ కంటే ఎమ్మెల్యే కన్నబాబు ఎక్కువ కృషి చేశారన్నారు. పరిహారం కోసం సీఎం వద్దకు వెళ్లి సంబంధిత ఫైల్‌ను త్వరగా పని అయ్యేలా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కరప జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, తహసీల్దార్ మురార్జీ, వీఆర్వో కోరుమిల్లి శ్రీనివాస్, ఉప సర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ నందిపాటి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు నందిపాటి సత్తిబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు నందిపాటి ధర్మరాజు, రాంబాబు, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్ టెన్నిస్‌బాల్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

- జాతీయస్థాయిలో తృతీయస్థానం కైవసం



జిల్లా క్రీడాకారులతో ఆర్జేడీ నాగమణి, చిత్రంలో ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి ప్రసాద్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): చత్తీస్‌ఘడ్‌లో ఈ నెల 18 నుంచి 22 వరకు జరిగిన జాతీయ స్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య 67వ సాఫ్ట్ టెన్నిస్ బాల్ పోటీలలో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనపరిచారని క్రీడా సమాఖ్య ప్రధాన కార్యదర్శి ప్రసాద్ గురువారం తెలిపారు. ఈ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు జాతీయస్థాయిలో తృతీయస్థానంలో నిలిచిందన్నారు. జిల్లా నుంచి పదో తరగతి విద్యార్థులు బి.చంద్రశేఖర్ (మూలపేట), అభిషేక్ (నేమాం), గట్టు ఆశిష్ కుమార్ (పిఠాపురం) పాల్గొన్నారని తెలిపారు. జట్టుకు నేమాం ఉపాధ్యాయుడు సుధాకర్ కోచ్‌గా వ్యవహరించారన్నారు. పాఠశాల విద్యాశాఖ కాకినాడ జోన్–2 ఆర్జేడీ నాగమణిని ఆమె కార్యాలయంలో విద్యార్థులు, కోచ్ మర్యాద పూర్వకంగా కలవగా ఆమె అభినందించారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

- రూరల్ నియోజకవర్గ ఈఆర్వో, ఆర్డీఓ కిశోర్
- ఘనంగా ఓటర్ల దినోత్సవం
- ఏపీఎస్పీ నుంచి సర్పవరం వరకు ర్యాలీ
- బీఎల్‌ఓలకు ప్రశంసా పత్రాల పంపిణీ



సర్పవరం జంక్షన్ వద్ద ప్రసంగిస్తున్న ఈఆర్వో కిశోర్



ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేయిస్తున్న జెడ్పీ సీఈవో రమణారెడ్డి

కాకినాడ రూరల్: ఓటు మన హక్కు అని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని నియోజకవర్గ ఎలక్టోరల్ అధికారి, ఆర్డీఓ ఇట్ల కిశోర్ పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటు హక్కు ఆవశ్యతను తెలియజేస్తూ విద్యార్థులు, అధికారులు ప్లకార్డులతో ఏపీఎస్పీ నుంచి సర్పవరం జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సర్పవరం జంక్షన్ కూడలి వద్ద ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. వేదికపై విద్యార్థులు ఓటు హక్కు ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ స్కిట్ ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈఆర్వో కిశోర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధమన్నారు. ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాస రచన, రంగవల్లులు పోటీలలో విజేతలు, ఓటర్ల నమోదులో ప్రతిభ చూపిన బీఎల్‌ఓలు, సెక్టర్ అధికారులకు ప్రశంసా పత్రాలు అందించారు. ట్రైనీ డీఎస్పీ ఈశ్వర్ సాయి యశ్వంత్ మాట్లాడుతూ యువతీ, యువకులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాకినాడ రూరల్, కరప తహసీల్దార్లు మురార్జీ, శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్లు కల్యాణ్, శ్రీనివాస్, వీఆర్వోలు దుర్గాప్రసాద్, నున్న సత్యనారాయణ, కాయల సత్యనారాయణ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ కార్యాలయంలో..

కాకినాడ సిటీ: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 14వ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని జెడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ ఓటర్ల దినోత్సవం ఎప్పటి నుంచి ప్రారంభమైంది, ఓటు హక్కు ఆవశ్యకత, జాతి నిర్మాణంలో దాని పాత్రను, ఓటరుగా మన కర్తవ్యం అనే అంశాలపై ఆయన వివరించారు. 14వ ఓటరు దినోత్సవాన్ని 'ఓటు కన్నా ఘనమైనది లేదని.. నేను తప్పక ఓటు వేస్తాను' అనే నినాదంతో నిర్వహించుకుంటున్నామని సీఈవో రమణారెడ్డి పేర్కొన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయ సిబ్బందితో ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ మినిస్టీరియల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్వీవీ రమేష్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కాండూరి శ్రీనివాసరావు, పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ ఆత్మహత్యా యత్నం

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్న పెద్దింశెట్టి వెంకటలక్ష్మి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. సర్పవరం పోలీసులు తెలిపిన వివరాల మేరకు పాత గైగోలుపాడుకు చెందిన వెంకటలక్ష్మి అంగన్‌వాడీ టీచర్‌గా చేస్తూ కుటుంబ అవసరాల కోసం రూ.1.5 లక్షలు అప్పు చేసింది. బాకీ తీర్చమని బుధవారం ఐదుగురు వ్యక్తులతో వచ్చిన రుణదాత ఆమెపై ఒత్తిడి తెచ్చాడు. దీంతో కంగారు పడిన ఆమె తీవ్ర మనస్తాపంతో సాయంత్రం 6 గంటల సమయంలో ఇంట్లోని కరోనా సమయంలోని కాలం చెల్లిన టాబ్లెట్లు వేసుకుని ఆత్మహత్యాయన్నానికి ప్రయత్నించింది. స్థానికులు సహాయంతో తల్లి సత్యవతి వెంటనే కాకినాడ జీజీహెచ్‌లో చేర్పింది. బాధితురాలి స్టేట్‌మెంట్ ఆధారంగా మహిళా హెడ్‌కానిస్టేబుల్ రాధిక గురువారం కేసు నమోదు చేశారు.


ఆకట్టుకున్న హరిహరన్, అశోక్‌ల గాత్ర కచేరీ



గాత్ర కచేరీ చేస్తున్న అశోక్, హరిహరన్

బోట్‌క్లబ్: సంగీత విద్వత్సభ సంక్రాంతి సంగీత నృత్యోత్సవాల్లో భాగంగా సూర్యకళా మందిరంలో గురువారం రాత్రి బెంగళూరుకు చెందిన హరిహరన్, అశోక్‌ల గాత్ర కచేరీ అద్భుతంగా జరిగింది. వింజమూరి వరదరాజ అయ్యంగార్ వర్ణంతో ప్రారంభించి, కేదార రాగంలో రామ నీపై నాకు, హుసేని రాగంలో రామ రామ రామ సీత మొదలైన కీర్తనలు చక్కగా గానం చేశారు. వీరికి వయోలిన్‌పై మావుడూరి సత్యనారాయణ శర్మ, మృదంగంపై పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్, ఘటంపై మావుడూరి సూర్య ప్రసాదరావు చక్కటి సహకారాన్ని అందించారు. నాదస్వర విద్వాంసులు రెహమాన్, కొమ్మిరెడ్డి శ్రీ రామ నరసింహారావు, శ్రీనివాస చౌదరి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్వత్సభ కార్యదర్శి వక్కలంక రామకృష్ణ పాల్గొన్నారు.

సంక్షేమ పాలనతో ప్రజలకు మేలు



సమావేశంలో పాల్గొన్న ప్రజలకు అభివృద్ధిని వివరిస్తున్న ప్రభాకర్ తదితరులు

కాకినాడ సిటీ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుండడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ అనుసూరి ప్రభాకర్ అన్నారు. గురువారం తూరంగి–5వ సచివాలం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ నిర్వహించారు. గ్రామంలో ఇప్పటి వరకు నిర్వహించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆ సచివాలయం పరిధిలో రూ.31 కోట్లతో చేసిన అభివృద్ధి పనుల చార్టులను ప్రదర్శించి ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకులు బొడ్డు సత్యనారాయణ, పరమట శ్రీను, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కరప: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి, కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతి చెందాడు. కరప ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపిన కథనం మేరకు మండలంలోని వాకాడ గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ చీకట్ల శ్రీనివాస్ (40) భార్యతో మనస్పర్థలు రావడంతో ఇద్దరు పిల్లలతో జీవిస్తున్నాడు. 10 రోజుల క్రితం కుమారుడితో గొడవపడి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతనిని చికిత్స కోసం కాకినాడ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. బాధితుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.